RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 11 సంచిక : 60 సోమవారం 13 - 10 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయున వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ

## నల్గొండలో గోదావరి నీళ్లు ప్రవహిస్తున్నాయంటే ఆయన వల్లే

- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి
- ఎస్సారెస్పీ-2 ప్రాజెక్టుకు రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు ఖరారు
- తుంగతుర్తి సభలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నల్గొండకు గోదావరి జలాలు ఆయన చలవేనన్న సీఎం
- 24 గంటల్లోనే జీవో జారీ చేస్తామని వెల్లడి
- దామోదర్ రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని హామీ
- ఆయన మృతికి సోనియా, ఖర్గే, రాహుల్ సంతాపం తెలిపారన్న సీఎం



తెలంగాణ దివంగత మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరుదైన గౌరవం ప్రకటించారు. ఆయన సేవలను చిరస్థాయిగా నిలిపేలా ఎస్సారెస్పీ-2 ప్రాజెక్టుకు 'రాంరెడ్డి దామోదర్ రెడ్డి ప్రాజెక్టు'గా నామకరణం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు రానున్న 24 గంటల్లోనే అధికారికంగా జీవో (ప్రభుత్వ ఉత్తర్వు) జారీ చేస్తామని స్పష్టం చేశారు.సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో ఆదివారం నిర్వహించిన రాంరెడ్డి దామోదర్ రెడ్డి స్మారక సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నల్గొండ గడ్డపై గోదావరి నీళ్లు - మిగతా 2 లో

## నేటి నుండి నామినేషన్లు స్వీకరణ

- షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయం వద్ద 144 సెక్షన్ విధింపు
- నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు నలుగురికే లోపలికి అనుమతి
- బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు.. బీజేపీపై ఉత్కంఠ
- 18 చెక్‌పోస్టులతో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు




జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు రంగం సిద్ధమైంది. నేటి నుండి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం

## కాంగ్రెస్‌కు ఓటేస్తే బుల్డోజర్లు వస్తాయి

- రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఫైర్
- జూబ్లీహిల్స్ ప్రజలు కారు కావాలో, బుల్డోజర్ కావాలో తేల్చుకోవాలన్న కేటీఆర్
- కాంగ్రెస్ పాలనలో పేదల ఇళ్ల కూల్చివేతలు జరుగుతున్నాయని తీవ్ర ఆరోపణ
- ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్న కేటీఆర్
- ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని పిలుపు
- బీజేపీ తెలంగాణకు పనికిరాని పార్టీ అని ఎద్దేవా



2 లో


## ఢిల్లీలోని ఎంబసీ మాదే తాలిబన్ జెండా ఎగరేసి ప్రకటించిన అఫ్ఘన్ మంత్రి!

- ఢిల్లీలోని అఫ్ఘాన్ రాయబార కార్యాలయం తమదేనన్న మంత్రి ముత్తఖీ
- మీడియా సమావేశంలో తాలిబన్ల జెండా ప్రదర్శన
- ఈసారి మహిళా పాత్రికేయులకు మీడియా సమావేశానికి అనుమతి
- మహిళల విద్యను తాము వ్యతిరేకించడం లేదని స్పష్టీకరణ
- భద్రత విషయంలో పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక జారీ
- అటారీ-వాఘా సరిహద్దు తెరవాలని భారత్‌కు విజ్ఞప్తి

భారత్‌లో పర్యటిస్తున్న ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ సంచలన ప్రకటన చేశారు. న్యూఢిల్లీలోని ఆఫ్ఘన్ రాయబార కార్యాలయం పూర్తిగా తమ నియంత్రణలోనే ఉందని స్పష్టం చేశారు. ఆదివారం - మిగతా 2 లో



## నకిలీ మద్యం నిగ్గు తేల్చేందుకు 'సిట్' ప్రకటించిన సీఎం చంద్రబాబు



- నకిలీ మద్యం వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు
- ఐపీఎస్ అధికారి జీవీజీ అశోక్ కుమార్ నేతృత్వంలో దర్యాప్తు
- సభ్యులుగా ముగ్గురు ఐపీఎస్ అధికారులు, ఎక్సైజ్ నిపుణుడు
- ఆఫ్రికాలో నేర్చుకుని ఇక్కడ అమలు చేస్తున్నారన్న ముఖ్యమంత్రి
- ఈ కేసులో దిగ్భ్రాంతికర నిజాలు బయటకొస్తాయని వెల్లడి
- నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు ప్రత్యేక యాప్ ఆవిష్కరణ

రాష్ట్రంలో తీవ్ర కలకలం సృష్టిస్తున్న ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి, ఏలూరు రేంజి ఐజీ జీవీజీ అశోక్ కుమార్ ఈ బృందానికి నేతృత్వం వహిస్తారని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.మీడియా సమావేశంలో నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు రూపొందించిన ఒక ప్రత్యేక యాప్‌ను ఆవిష్కరించిన - మిగతా 2 లో

## వైసీపీ నేతలపై బాలకృష్ణ ఫైర్



- అధికారం కోసమే కొత్త నాటకాలు!
- వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన ఎమ్మెల్యే బాలకృష్ణ
- మళ్లీ అధికారం కోసమే వారి పనికిమాలిన ప్రసంగాలు అంటూ విమర్శ
- గత ప్రభుత్వ హయాంలో హిందూపురం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆరోపణ
- వైద్య కళాశాలల అభివృద్ధిని వైసీపీ పట్టించుకోలేదని ధ్వజం
- తుమ్మలకుంటలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన బాలయ్య

వైసీపీ నేతలు మళ్లీ అధికారంలోకి రావాలనే ఆశతో పనికిమాలిన ప్రసంగాలు చేస్తున్నారని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తీవ్రస్థాయిలో విమర్శించారు. గడిచిన ఐదేళ్లలో ఏమాత్రం అభివృద్ధి చేయని వారు, ఇప్పుడు కొత్తగా పీపీపీ మోడల్ పై నాటకాలు ఆడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం తుమ్మలకుంట గ్రామంలో పర్యటించిన ఆయన, అర్హులైన వారికి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బాలకృష్ణ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో హిందూపురం నియోజకవర్గం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. "వైసీపీ నేతలు కేవలం అధికారంపై - మిగతా 2 లో

# ఆర్థిక రాజధానిగా విశాఖపట్నం రూపకల్పన

- విశాఖకు పదేళ్ల సమయం చాలు
- ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం
- 2047 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం
- ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ ప్రభుత్వ విధానమని స్పష్టీకరణ
- దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి విశాఖకు రాక
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషితో విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ
- రాబోయే మూడేళ్లలో మరిన్ని భారీ పెట్టుబడులు వస్తాయని లోకేశ్ ధీమా



ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధాని అమరావతి కాగా, రాష్ట్రాభివృద్ధిలో కీలకమైన ఆర్థిక రాజధానిగా విశాఖపట్నాన్ని తీర్చిదిద్దనున్నట్లు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 2047 నాటికి విశాఖను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ప్రకటించారు. విశాఖలో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం రిషికొండలో జరిగిన కార్యక్రమంలో లోకేశ్ ప్రసంగించారు."ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణే మా విధానం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు మా విధానానికే పట్టం కట్టారు. సమర్థ పాలన, ఉద్యోగాల కల్పన, విశాఖను ఆర్థిక రాజధానిగా చేయడం కోసమే 94 శాతం సీట్లతో మమ్మల్ని గెలిపించారు" అని లోకేశ్ అన్నారు. హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందడానికి 30 ఏళ్లకు పైగా సమయం పడితే, విశాఖను అభివృద్ధి చేయడానికి పదేళ్ల సమయం చాలని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇది తమ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు.

**భారత్‌లోనే అతిపెద్ద విదేశీ పెట్టుబడి విశాఖకు**

విశాఖ అభివృద్ధి కోసం - మిగతా 2 లో

## విశాఖలో వరల్డ్ కప్ మ్యాచ్



- స్టేడియంలో సందడి చేసిన ఏపీ మంత్రి నారా లోకేశ్
- విశాఖలో టీమిండియా, ఆస్ట్రేలియా మ్యాచ్
- హాజరైన మంత్రి లోకేశ్, జై షా
- స్టేడియం గ్యాలరీకి మిథాలీ రాజ్ పేరు నామకరణం
- స్టేడియం మూడో గేటుకు రావి కల్పన పేరు
- ఐసీసీ మహిళల వరల్డ్ కప్ మ్యాచ్ వేళ ఈ కార్యక్రమం
- పాల్గొన్న బీసీసీఐ నూతన అధ్యక్షుడు, ఏసీఏ పెద్దలు
- మహిళా దిగ్గజాలను గౌరవించడమే లక్ష్యమన్న ఏసీఏ

విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో భారత మహిళా క్రికెట్ దిగ్గజాలకు అరుదైన గౌరవం దక్కింది. ఐసీసీ మహిళల ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో భాగంగా టీమిండియా, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ సందర్భంగా, స్టేడియంలోని ఒక గ్యాలరీకి, ఒక గేటుకు మహిళా క్రికెటర్ల పేర్లు పెట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, ఐసీసీ చైర్మన్ జై షా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, లెజెండరీ బ్యాటర్ మిథాలీ రాజ్ పేరును స్టేడియంలోని 'ఏ-గ్యాలరీ'కి నామకరణం చేశారు. అదేవిధంగా, స్టేడియంలోని మూడో నంబర్ గేటుకు మాజీ వికెట్ కీపర్ రావి కల్పన పేరును పెట్టారు.

- మిగతా 2 లో

# సంపాదకీయం

## శాంతి కుసుమిస్తుందా



అమెరికా అధ్యక్షుడి నోబెల్ శాంతి పురస్కార కాంక్ష రెండేళ్ళయుద్ధాన్ని కొలిక్కితెస్తున్నట్టుంది. పతకం మోజులో ఆయన పాలస్తీనియన్లకు అన్యాయం చేశాడనీ, అయినా, అరబ్, ముస్లిం దేశాలు కక్కలేక, మింగలేక ఆ ఇరవైసూత్రాల శాంతిపథకాన్ని పొగుడుతున్నాయని కొందరు విమర్శిస్తున్నారు. మొదట్లో దోహాలోనూ, శ్వేతసౌధంలోనూ ఒకే రీతిలో ఉన్న ఆ ప్రణాళిక ఆ తరువాత నెతన్యాహూ వైపు బాగా మొగ్గి, ట్రంప్ ఒత్తిళ్ళు, హెచ్చరికలు, లక్ష్మణరేఖల బలంతో బలవంతంగా పట్టాలెక్కిందని అంటున్నారు. ఎవరు చెప్పారు మనకు నష్టం జరుగుతోందని, మన సైనికులు వెనుకడుగువేయాలని, ఊసేలేని పాలస్తీనా రాజ్యాన్ని మనం ఒప్పుకుంటున్నామని? అంటూ హిబ్రూలో బెంజమెన్ నెతన్యాహూ తన ప్రజలకు భరోసా ఇస్తున్నారు. గాజా మీద ఏకపక్ష యుద్ధంలో వేలాదిమందిని సంహరించి, లక్షల మందిని నిరాశ్రయులను చేసి, దానిని వల్లకాడుగా మార్చినా కూడా నెతన్యాహూ సాధించలేకపోయినదానిని శాంతిప్రణాళిక పేరిట శ్వేతసౌధం ఆయనకు పళ్ళెంలో పెట్టి ఇచ్చింది. హమాస్ దుంపనాశనం, బందీల విడుదల తన లక్ష్యాలుగా, యుద్ధాన్ని నచ్చినంత కాలం, ట్రంప్ మెచ్చినంతవరకూ పొడిగిస్తూ వచ్చిన ఇజ్రాయెల్ అధినేతకు యుద్ధక్షేత్రంలో దక్కనిది శ్వేతసౌధంలో చిక్కింది. బందీలను వెనక్కు తెచ్చేవరకూ వెనకడుగువేయబోనని శపథం చేసి, అంతిమంగా నిలబెట్టుకున్నాను అని నెతన్యాహూ గర్వపడుతున్నారు. మితవాదులు, మహా జాతీయవాదులు, మతదురహంకారులతో నిండిన ఆయన కూటమి ప్రభుత్వంలోని నాయకులు మాత్రం, గాజాలో ఒక్క పాలస్తీనా ప్రాణి కూడా మిగలకూడదన్న మా లక్ష్యం ఇక నెరవేరదా? అని వాపోతున్నారు.ప్రకటిత కాల్పుల విరమణ ఒప్పందం కడవరకూ నిలిచి, అన్ని దశలూ పూర్తిచేసుకోవడం ప్రధానం. బందీల అప్పగింతలు, సైనికుల వెనుకడుగుల లెక్కలు రాసుకున్నదానికి అనుగుణంగా సాగినప్పుడే ట్రంప్‌ను ప్రపంచ దేశాధినేతలు కీర్తిస్తున్న ఈ సందర్భానికి అర్థం ఉంటుంది. ఒప్పందం కుదిరిందన్న ప్రకటనతో అటు ఇజ్రాయెల్‌లోనూ, ఇటు గాజాలోనూ వెల్లువెత్తిన హర్షాతిరేకాలు ఇక శాశ్వతంగా నిలవాలి. అనేకసార్లు ఒప్పందాలకు మోకాలడ్డిన నెతన్యాహూను ఇటీవల ఖతార్ మీద చేసిన దాడి ఈమారు ఆత్మరక్షణలో పడవేసింది. శాంతిచర్చలు ముందంజలో ఉండగా, కీలకమైన హమాస్ నేతలను మట్టుబెట్టడం ద్వారా నెతన్యాహూ అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయన తన యుద్ధకాంక్షను మరోమారు వెళ్ళగక్కడం కంటే, మధ్య ఆసియాలో తనకు అత్యంత కీలకమైన, అతి మిత్రదేశమైన ఖతార్‌లోకి ఇజ్రాయెల్ యుద్ధవిమానాలు చొరబడి బాంబులు కురిపించిన ఆ ఘటనను అమెరికా అధ్యక్షుడు వెనకేసుకురావడం అరబ్‌దేశాలను నిర్ఘాంతపరిచింది. దోహాపై దాడిని నెతన్యాహూ తనకు చెప్పే చేశాడని ఒకసారి, తన ప్రమేయంలేదని మరోసారి, అయినా తప్పేనని వ్యాఖ్యానించి ట్రంప్ కూడా పరువుపోగొట్టుకున్నారు. రక్షణకవచంగా ఉంటానన్న అమెరికా అలా భక్షకుడి పక్షాన నిలిచి తమకు ధోకా ఇచ్చినందుకు అరబ్‌దేశాలు ఆగ్రహించడమే కాక, అవన్నీ బలంగా జట్టుకట్టడం మొదలైంది. దీంతో, అప్పటివరకూ తలెగరేస్తూవచ్చిన నెతన్యాహూ మెడలువంచి శ్వేతసౌధం నుంచే ఖతార్ అధినేతకు ఫోన్‌లో సారీ చెప్పించడం ద్వారా ట్రంప్ కొంత ప్రాయశ్చిత్తం చేసుకున్నారు. ప్రత్యేక ఆదేశాలతో ఖతార్ భద్రతకు మరింత కట్టుబడ్డారు. అరబ్ దేశాలు చేజారిపోతూ, మరోపక్క పాలస్తీనా రాజ్యాన్నీ, ఇరుగుపొరుగు సిద్ధాంతాన్ని ఐరోపా అధినేతలంతా బలంగా ముందుకు తోస్తున్న తరుణంలో సమయం మించిపోతున్న సంగతి ట్రంప్ గ్రహించినట్టు ఉంది. తాను అధికారంలోకి రాగానే ఒక్క టెలిఫోన్ కాల్‌తో రష్యా అధ్యక్షుడు పుతిన్ మెడలు వంచగలననీ, ఒక్కరోజులో ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపగలననీ భ్రమసిన ట్రంప్‌ను అసహనం ముంచెత్తుతోంది. ఏడుయుద్ధాలు ఆపినా, బరాక్ ఒబామాను ప్రశంసించిన మాదిరిగా మిగతా ప్రపంచం తనను కీర్తించనందుకు ఆగ్రహం కలుగుతోంది. తనకు నోబెల్ రాకపోతే అమెరికాకే అవమానమని వారం క్రితం కూడా హెచ్చరించిన ట్రంప్, రాజ్యవిస్తరణ లక్ష్యంతో రగిలిపోతున్న నెతన్యాహూను నియంత్రించి, ఒప్పందాన్ని తుదివరకూ నిలబెట్టి, యుద్ధాన్ని ముగించాలి.

## వైసీపీ నేతలపై బాలకృష్ణ ఫైర్

**మొదటిపేజీ తరువాయి** – యావతోనే ఉన్నారు. అప్పట్లో వైద్య కళాశాలల అభివృద్ధికి వారు చేసిందేమీ లేదు. ఇప్పుడు మాత్రం అధికారంలోకి రావాలనే ఉబలాటంతో ఏవేవో ఊహించుకుంటూ మాట్లాడు తున్నారు" అని బాలకృష్ణ ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధిని, ముఖ్యంగా వైద్య విద్యా సంస్థలను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆయన ఆరోపించారు.తన లక్ష్యం హిందూపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమేనని బాలకృష్ణ స్పష్టం చేశారు. ఆ దిశగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముందు గ్రామానికి చేరుకున్న బాలకృష్ణకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ఈ పర్యటనలో పలువురు స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## విశాఖలో వరల్డ్ కప్ మ్యాచ్

**మొదటిపేజీ తరువాయి** – మంత్రి లోకేశ్, జై షా ఈ నామకరణ కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బీసీసీఐ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మిథున్ మన్హాస్‌తో పాటు, ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ) అధ్యక్షుడు కేశినేని శివనాథ్, ఏసీఏ కార్యదర్శి సానా సతీశ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ మాట్లాడారు. మహిళా క్రికెట్‌కు ఎనలేని సేవలు అందించిన మిథాలీ రాజ్, రావి కల్పన వంటి దిగ్గజాలను గౌరవించుకోవడం తమ బాధ్యత అని ఆయన అన్నారు. ఆంధ్రా క్రికెట్ సంఘం తీసుకున్న ఈ నిర్ణయాన్ని క్రీడాభిమానులు స్వాగతిస్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## నల్గొండలో గోదావరి నీళ్లు ప్రవహిస్తున్నాయంటే ఆయన వల్లే

**మొదటిపేజీ తరువాయి** – ప్రవహిస్తున్నాయంటే అది కేవలం దామన్న ధైర్యం, పట్టుదల వల్లే సాధ్యమైంది. ఆయన ఒత్తిడితోనే నాటి ప్రభుత్వం ఎస్సారెస్పీ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లింది" అని గుర్తుచేశారు. తుంగతుర్తి ప్రజల అభివృద్ధి కోసం ఆర్‌డీఆర్ నిస్వార్థంగా పనిచేశారని సీఎం కొనియాడారు.దామోదర్ రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ, అధిష్ఠానం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని సీఎం భరోసా ఇచ్చారు. ఆయన మృతి పట్ల కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారని తెలిపారు. సోనియా గాంధీ స్వయంగా ఆయన కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారని వెల్లడించారు.ఎస్సారెస్పీ-2 ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంత రైతుల సాగునీటి కష్టాలు తీరతాయని, ఇది దామోదర్ రెడ్డి ఆశయాలకు దక్కే నిజమైన నివాళి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## నకిలీ మద్యం నిగ్గు తేల్చేందుకు 'సిట్' ప్రకటించిన సీఎం చంద్రబాబు

**మొదటిపేజీ తరువాయి** – అనంతరం చంద్రబాబు ఈ కీలక ప్రకటన చేశారు. సిట్ సభ్యులుగా ఐపీఎస్ అధికారులు రాహుల్ దేవ్ శర్మ (ఎక్సైజ్ శాఖ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్), కె. చక్రవర్తి (సీఐడీ ఎస్పీ), మల్లికా గార్గ్ (ఆర్టీజీఎస్)లను నియమించినట్టు తెలిపారు. వీరితో పాటు ఎక్సైజ్ శాఖ నుంచి ఈ అంశంపై పూర్తి అవగాహన ఉన్న ఒక నిపుణుడిని కూడా బృందంలో చేర్చుతామని ఆయన వివరించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కొన్ని సంచలన వ్యాఖ్యలు చేశారు. నకిలీ మద్యం కేసులో దిగ్భ్రాంతికి గురిచేసే నిజాలు ఉన్నాయని, వాటిని త్వరలోనే బయటపెడతామని అన్నారు. "ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారు ఆఫ్రికాలో నేర్చుకుని ఇక్కడ అమలు చేస్తున్నారు" అని చంద్రబాబు ఆరోపించారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న సూత్రధారులను, వారి కార్యకలాపాలను పూర్తిగా వెలికితీసేందుకే సిట్ దర్యాప్తుకు ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు.

## ఆర్థిక రాజధానిగా విశాఖపట్నం రూపకల్పన

**మొదటిపేజీ తరువాయి** – ప్రభుత్వం చేస్తున్న కృషిని లోకేశ్ వివరించారు. "గత 17 నెలల్లో రాష్ట్రానికి వచ్చిన 120 బిలియన్ డాలర్ల పెట్టుబడుల్లో 50 శాతానికి పైగా గ్రేటర్ విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్‌కే వచ్చాయి. దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్, భారత చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) కూడా విశాఖపట్నానికే రాబోతోంది" అని ఆయన కీలక ప్రకటన చేశారు. ఈ పెట్టుబడుల ద్వారా విశాఖలో శక్తివంతమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని అన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఉద్యోగాలు, అందులో కేవలం విశాఖలోనే 5 లక్షల ఐటీ ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు.

**డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు**

కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే కూటమి అధికారంలో ఉండటం వల్ల అభివృద్ధి బుల్లెట్ రైలు వేగంతో దూసుకెళుతోందని లోకేశ్



అభివర్ణించారు. "డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోగలిగాం. కేంద్రం రూ.11 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.3 వేల కోట్లు అందించి ప్లాంట్‌ను ఆదుకున్నాయి. ప్రస్తుతం మూడు ఫర్నేస్‌లు పనిచేస్తున్నాయి. త్వరలోనే వంద శాతం సామర్థ్యంతో నడిపి లాభాల బాట పట్టిస్తాం" అని ఆయన వివరించారు. రైల్వే జోన్ సాధించామని, స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నామని గుర్తుచేశారు.ఈ పెట్టుబడులు తీసుకురావడం వెనుక ఎనిమిదేళ్ల కృషి ఉందని లోకేశ్ తెలిపారు. సిఫీ ఛైర్మన్ రాజు వేగేశ్నను 2017లో కాలిఫోర్నియాలో కలిసినప్పటి నుంచి ఈ ప్రయాణం మొదలైందని గుర్తు చేసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ విశాఖకు రావడంలో మంతెన రామరాజు, ఎన్నారై టీడీపీ నేత సాగర్ దొడ్డపనేని, ఐఏఎస్ అధికారి కాటంనేని భాస్కర్ వంటి వారు కీలక పాత్ర పోషించారని అభినందించారు. రాబోయే మూడు నెలల్లో మరిన్ని పెట్టుబడులు విశాఖకు తరలివస్తాయని, ఏ ఒక్క పెట్టుబడి కూడా పొరుగు రాష్ట్రాలకు వెళ్లకుండా చూస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేటి నుండి నామినేషన్ల స్వీకరణ

**మొదటిపేజీ తరువాయి** – కానుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ప్రక్రియను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నామినేషన్ల కేంద్రంగా ఉన్న షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయం పరిసరాల్లో 144 సెక్షన్ విధిస్తున్నట్లు ప్రకటించారు.ఉప ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు ర్యాలీలుగా వచ్చే అవకాశం ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఎన్నికల కార్యాలయం వద్దకు వాహనాలను పూర్తిగా నిషేధించారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు కేవలం నలుగురిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతించనున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే 18 మార్గాల్లో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెంచారు.మరోవైపు, ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే తమ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో ఉన్నాయి. అధికార బీఆర్ఎస్ పార్టీ తరఫున మాగంటి సునీత పేరును ప్రకటించగా, కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ కుమార్ బరిలో నిలవనున్నారు. బీజేపీ అభ్యర్థి ఎవరనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. నామినేషన్లు వేయడానికి పది రోజుల సమయం ఉండటంతో, అభ్యర్థులు మంచి ముహూర్తం కోసం ఎదురుచూస్తున్నారు.పశ్చిమ మండలం డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ నేతృత్వంలో ఈ బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. అడిషనల్ డీసీపీ, ఇద్దరు ఏసీపీలు, ఐదుగురు సీఐలు, 9 మంది ఎస్ఐలతో పాటు 59 మంది సిబ్బంది, రెండు ప్లాటూన్ల బలగాలు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు ఈ భద్రతా వలయం




కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే బుల్డోజర్లు వస్తాయి

**మొదటిపేజీ తరువాయి** – జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి చిహ్నమైన 'కారు' గుర్తుకు ఓటేస్తారో, లేక విధ్వంసానికి ప్రతీకగా మారిన 'బుల్డోజర్'ను ఎంచుకుంటారో తేల్చుకోవాలని సూటిగా ప్రశ్నించారు. ఈ ఉప ఎన్నిక ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో షేక్‌పేట్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు చెర్క మహేశ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**పేదల ఇళ్లపై బుల్డోజర్ల దాడి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్‌లోని పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడుపుతున్నారని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులు, చట్టబద్ధమైన పత్రాలు ఉన్నప్పటికీ, వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా గరీబుల నివాసాలను కూల్చివేస్తున్నారని ధ్వజమెత్తారు. "కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి జరగదు, బుల్డోజర్లు మాత్రమే వస్తాయి. ప్రజలు ఈ విషయాన్ని స్పష్టంగా గ్రహించాలి" అని ఆయన హెచ్చరించారు. రెండు సంవత్సరాల పాలనలో కాంగ్రెస్



ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా పెట్టలేదని, ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. అభివృద్ధిని గాలికి వదిలేసి, రాష్ట్రాన్ని రూ. 2.80 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు.

**హామీలన్నీ మోసమే...!**

ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. నెలకు రూ. 4 వేల పెన్షన్ వంటి హామీలు అమలు కావాలంటే, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించడమే మార్గమని అన్నారు. "ఈ ఎన్నికలో అధికార పార్టీ ఓడిపోతేనే వారికి భయం పుట్టి హామీలను అమలు చేస్తారు. ఒకవేళ పొరపాటున గెలిపిస్తే, మనం ఎన్ని మోసాలు చేసినా ప్రజలు ఏమీ చేయలేరనే ధీమాతో ఉంటారు" అని వ్యాఖ్యానించారు.బీసీ రిజర్వేషన్లు, అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ పదవి, ముస్లింలకు ఖబరస్థాన్ స్థలం వంటి విషయాల్లోనూ కాంగ్రెస్ మోసపూరితంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. "ప్రజలను తెలిసి తెలిసి మోసం చేయడమే రేవంత్ రెడ్డి నైజం. గతంలో 'మోసం చేసే వాళ్లనే ప్రజలు నమ్ముతారు' అని ఆయనే స్వయంగా చెప్పారు" అని కేటీఆర్ గుర్తుచేశారు.

**బీజేపీపైనా విమర్శలు :** ఈ సందర్భంగా బీజేపీపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి ఏమాత్రం పనికిరాని పార్టీ అని, కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయడం అంటే ఆ ఓటును మోరీలో వేసినట్లేనని ఆయన ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఓటుకు రూ. 10,000 పంచి గెలవాలని చూస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ నగరం తిరిగి అభివృద్ధి పథంలో పయనించాలంటే కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలని, అందుకు జూబ్లీహిల్స్ నుంచే నాంది పలకాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రెండేళ్లుగా కేసీఆర్‌ను తిట్టడం మినహా రేవంత్ రెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు.

## ఢిల్లీలోని ఎంబసీ మాదే...తాలిబన్ జెండా ఎగరేసి ప్రకటించిన అఫ్ఘన్ మంత్రి!

**మొదటిపేజీ తరువాయి** – ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తన ముందు, వెనుక ఇస్లామిక్ ఎమిరేట్ (తాలిబన్) జెండాను ఉంచి మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది.భారత్ ఇంకా అధికారికంగా తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించనప్పటికీ, ఎంబసీలో పాత జెండానే కొనసాగుతున్నప్పటికీ ఆయన ఈ ప్రకటన చేయడం గమనార్హం. "ఇది మా జెండా. దీని నీడలోనే మేం జిహాద్ చేశాం. ఈ ఎంబసీ నూటికి నూరు శాతం మాదే. ఇక్కడ పనిచేస్తున్న వారంతా మాతోనే ఉన్నారు" అని ముత్తాఖీ ఒక ప్రశ్నకు బదులిస్తూ తేల్చి చెప్పారు.గతంలో మహిళా జర్నలిస్టులను అనుమతించలేదని విమర్శలు రావడంతో, ఈసారి ఆదివారం నాటి సమావేశానికి మహిళా జర్నలిస్టులతో సహా పెద్ద సంఖ్యలో మీడియా ప్రతినిధులను అనుమతించారు.

**భారత్‌తో ఫలవంతమైన చర్చలు**

భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో జరిపిన చర్చలు ఫలవంతంగా, నిర్మాణాత్మకంగా సాగాయని ముత్తాఖీ తెలిపారు. "వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, ఆరోగ్యం, విమాన సర్వీసులు, అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించాం. వాణిజ్య వీసాలు, విద్యార్థుల మార్పిడి, ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభించేందుకు భారత్ సంసిద్ధత వ్యక్తం చేసింది" అని ఆయన వివరించారు. కాబూల్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా భారత్ నిర్ణయించిందని ఆయన వెల్లడించారు.ఢిల్లీ-కాబూల్, ముంబై-కందహార్, అమృత్‌సర్-ఆఫ్ఘనిస్థాన్ మధ్య కొత్త విమాన సర్వీసులను ప్రారంభించే ప్రణాళికలను ముత్తాఖీ ప్రకటించారు. ఇరు దేశాల మధ్య ఉమ్మడి వాణిజ్య కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు, ఖనిజాలు, వ్యవసాయం, క్రీడల రంగాల్లో సహకారంపై కూడా చర్చలు జరిపినట్లు తెలిపారు. ఆఫ్ఘన్ సరుకుల కోసం అటారీ-వాఘా సరిహద్దును తెరవాలని భారత్‌ను కోరినట్లు ఆయన ధృవీకరించారు.

**మహిళల విద్య, పాకిస్థాన్‌పై వ్యాఖ్యలు**

మహిళల హక్కులపై అడిగిన ప్రశ్నకు, "ఇస్లాంలో స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా అందరి హక్కులకు రక్షణ ఉంది. మేం విద్యకు వ్యతిరేకం కాదు. విద్య హరామ్ కాదు" అని ముత్తాఖీ అన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో బాలికలతో సహా కోటి మందికి పైగా విద్యార్థులు పాఠశాలలకు వెళుతున్నారని, కేవలం కొన్ని నిర్దిష్ట ప్రాంతాల్లోనే ఆంక్షలున్నాయని పేర్కొన్నారు.పాకిస్థాన్ విషయంలో ముత్తాఖీ కఠిన స్వరంతో మాట్లాడారు. "మేం శాంతియుత సంబంధాలనే కోరుకుంటాం. కానీ సంబంధాలు దెబ్బతింటే,



భద్రతను ఎలా కాపాడుకోవాలో మాకు కూడా తెలుసు" అని హెచ్చరించారు. ఆఫ్ఘనిస్థాన్‌ను నిందించే బదులు పాకిస్థాన్ తమ చెక్‌పోస్టులను అదుపులో పెట్టుకోవాలని సూచించారు. తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులు తమ గడ్డపై లేరని ఆయన స్పష్టం చేశారు.

## 'ఈ నెల 14న తెలంగాణ బంద్

**రాజకీయ పార్టీలు, కుల సంఘాలు మద్దతివ్వాలి'**

**స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌లపై హైకోర్టు తీర్పు**

**రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ నెల 14న 'రాష్ట్ర బంద్'**

**రాజకీయ పార్టీల మద్దతు కోరిన ఆర్.కృష్ణయ్య**

బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ ఈ నెల 14న తెలంగాణ బంద్ నిర్వహిస్తామని ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. అన్ని బీసీ సంఘాల మద్దతుతో బంద్ నిర్వహిస్తామని ఆయన అన్నారు. రాజకీయ పార్టీలు, కుల సంఘాలు బంద్‌కు మద్దతివ్వాలని కోరారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి బంద్‌కు బీజేపీ మద్దతు ఇవ్వాలని కోరామని, పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని కృష్ణయ్య తెలిపారు.

**'రాష్ట్ర బంద్'కు మద్దతివ్వాలని పిలుపు :** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పునకు నిరసనగా ఈ నెల 14న నిర్వహించనున్న 'రాష్ట్ర బంద్'కు మద్దతివ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య శనివారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. రాష్ట్ర బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతివ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర



బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నీలం వెంకటేశ్, గ్రేటర్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నీరడి భూపేశ్ సాగర్, పలు బీసీ సంఘాల నేతలు సి.రాజేందర్, జిల్లపల్లి అంజి, పగిళ్ల సతీశ్, అనంతయ్య, రాజ్‌కుమార్ తదితరులు దీనిలో పాల్గొన్నారు.

**బంద్‌కు మద్దతివ్వని పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటిస్తాం :** తెలంగాణ బంద్‌కు మద్దతు ప్రకటించని పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. దీనిలో భాగంగా శనివారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బంద్ తర్వాత బీసీల మిలియన్ మార్చ్‌ను నిర్వహించి, హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. బంద్‌కు మద్దతు ప్రకటించారు.

**బీసీ రిజర్వేషన్‌లపై హైకోర్టు తీర్పు :ద**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్?లపై హైకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఏం చేయాలి అనే విషయంపై తెలంగాణ ఎన్నికల సంఘం న్యాయ నిపుణులను సంప్రదిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్?లు కల్పిస్తూ జీవో 9, తదనంతర ఎన్నికల ప్రక్రియ నిమిత్తం జారీ చేసిన 41, 42 జీవోల అమలును మాత్రమే నిలిపివేస్తున్నట్లు హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుల్లో స్పష్టంగా ఉంది.అంతే కాకుండా ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవడం లేదని న్యాయస్థానం తేల్చి చెప్పింది. 50 శాతం రిజర్వేషన్?లు మించకుండా మిగిలిన సీట్లను దామాషా పద్ధతిలో ఓపెన్ కేటగిరీ కింద పరిగణనలోకి తీసుకుని ఎన్నికలు నిర్వహించుకోవచ్చని తెలిపింది. అయినా కూడా రిజర్వేషన్?ల అమలుపై మళ్లీ సందిగ్ధత మొదలవుతోంది. ఇప్పటికే 42 శాతం రిజర్వేషన్?ల ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో పంచాయతీలు, వార్డుల కేటాయింపు ప్రక్రియ జరిగింది. ఇలా విభజించాల్సింది రాష్ట్ర ప్రభుత్వమే.

# మేడారంలో పనులు వేగవంతం

## చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి పనులు

### మంత్రి సీతక్క



**ములుగు జిల్లా ప్రతినిధి తెలంగాణ సేన.** :మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి పనుల కోసం సీఎం రేవంత్ రెడ్డి పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు గద్దెల ప్రాంగణాన్ని విస్తరించింది, అద్భుతంగా గుడినీ అభివృద్ధి చేసి భక్తులకు ఎంత మెరుగైన దర్శనాన్ని, సదుపాయాలను కల్పించాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారు. సీఎం ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి వారం క్రితమే మేడారం అభివృద్ధి పనులు మొదలయ్యాయి. జాతర రాకముందే పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుంటున్నారు. తల్లుల మీద మీద రోజు రోజుకి భక్తుల విశ్వాసం పెరుగుతోంది. దీంతో భక్తులు పెద్ద ఎత్తున వస్తున్నారు . మేడారం మహా జాతర ఏర్పాట్లు ఇప్పటికీ మొదలయ్యాయి.మేడారం పనులు శాశ్వతంగా నిలిచిపోయేలా పనులు సాగుతున్నాయి. భక్తులకు ఎక్కడ అసౌకర్యం కలగకుండా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నాం. గుడి అభివృద్ధిలో నాకు భాగస్వామ్యం దక్కడం నా అదృష్టం సీఎం కి, జిల్లా ఇంచార్జ్ ఇన్చార్జ్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి ఎండోమెంట్ మినిస్టర్ సురేఖ కి, ట్రైబల్ మినిస్టర్ అడ్లూరి లక్ష్మన్ కి ధన్యవాదాలు. ప్రతి దశలో పూజారులను సంప్రదిస్తూ పనులు కొనసాగిస్తున్నాము . గుడి నిర్మాణంలో ఆదివాసుల చరిత్ర, సమ్మక్క సారలమ్మ గోవిందరాజు పగిడిద్దరాజుల కుటుంబాల చరిత్ర, వారి త్యాగాలు, పూజారుల వంశ చరిత్ర ను భవిష్యత్తు తరాలకు అందించేలా అభివృద్ధి పనులు చేస్తున్నాము. ఈ జన్మకు ఇదో గొప్ప అవకాశం గా భావిస్తున్నాం . ఎవరెన్ని విమర్శలు చేసినా వెయ్యేండ్లు నిలిచేలా మేడారాన్ని అభివృద్ధి చేస్తాం. నాకు జన్మనిచ్చింది సమ్మక్క సమ్మయ్య కానీ నాకు పునర్జన్మ ఇచ్చింది సమ్మక, సారలమ్మ, పగిడిద్ద గోవిందరాజులు. ఈ స్థాయికి తీసుకొచ్చి సమ్మక సారలమ్మ, ములుగు ప్రాంత ప్రజలు కాబట్టి తల్లుల సేవలో ప్రజాసేవలో ఎల్లప్పుడు ఉంటాము.తల్లుల గొప్ప కీర్తిని కించిత్ తగ్గకుండా ముందుకు తీసుకెళ్తాము. ఈ చిన్న సమస్య లేకుండా గుడి నిర్మాణాన్ని పూర్తి చేస్తాము సీతక్క తెలిపారు.

## మసీద్ - ఏ - ఫైసల్ ప్రారంభోత్సవం చేసిన జారే



**ఖమ్మం, తెలంగాణ సేన న్యూస్: :** ములకలపల్లి మండలం శీతరామపురం గ్రామంలో మసీద్ - ఏ - ఫైసల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన అశ్వరావుపేట నియోజకవర్గ శాసన సభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ నియోజకవ్గం లో ముస్లిం మైనార్టీ సోదరులా కు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు,ముస్లిం సోదరుల అభిరుదే ధ్యేయం గా పని చేస్తున్నని గుర్తుచేశారు,ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్ గారు, మాజీ జెడ్పిటిసి బత్తుల అంజి ,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పాలకుర్తి సుమిత్ , కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నవదీప్ ఫౌండేషన్, రెడీ టు సర్వ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్:** బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ వద్ద నవదీప్ ఫౌండేషన్, రెడీ టు సర్వ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గత 13 సంవత్సరాలుగా ప్రతి ఆదివారం ఏదో ఒక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిరంతరంగా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న రెడీ టు సర్వ్ ఫౌండేషన్ సభ్యులు, ఈసారి సుమారు 300 మంది పేదలకు, రోగుల బంధువులకు భోజనం అందించారు. స్వచ్ఛంద దాతల సహకారంతో జరుగుతున్న ఈ పుణ్య కార్యక్రమం ప్రశంసనీయమని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో మరింతమంది దాతలు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధులుగా సతీష్ గౌడ్ శ్రీ దేవి చంద్ర రెడ్డి అనంత రెడ్డి పద్మావతి గార్లు ప్రకాష్ రాజు నవదీప్ ఫౌండేషన్ సభ్యులు సామర్ల సత్యనారాయణ గారు వారి సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వంగపల్లి అంజయ్య స్వామి జన్మదిన వేడుకలు



**సిద్దిపేట** జిల్లా గజ్వేల్ ప్రభుత్వ దవాఖాన వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అల్పాహార పంపిణీ ఆదివారం 5 వ సంవత్సరం 104 వ రోజుకు చేరుకుంది, ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య మహాసభ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ ఉపాధ్యక్షుడు అయిత సత్యనారాయణ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం అని,ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త యాదగిరి గుట్ట భువనగిరి జిల్లా ఆలేరు నియోజక వర్గం కాచారం రేణుకా ఎల్లమ్మ దేవాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు వంగపల్లి అంజయ్య స్వామి జన్మదినం సందర్భంగా అల్పాహారంతో పాటు అరటి పండ్లు బ్రెడ్ పంపిణీ చేసి నిరుపేదలకు చీరలు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు, ఈ కార్యక్రమంలో లయన్ సామా శ్రీధర్,లయన్ గుడాల శేఖర్,రాము, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే దొంతిని పరామర్శించిన మాజీ మంత్రి జానారెడ్డి,ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి తెలంగాణ సేన :** నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి కాంతమ్మ గారు ఇటీవల మృతి చెందగా నేడు మాజీ హోం మంత్రి, మాజీ సీఎల్పీ లీడర్ కుందూరు జానారెడ్డి , నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి హన్మకొండలోని వారి నివాసంలో సంతాపం తెలిపారు..ఈ సందర్భంగా మాజీ మంత్రి జానారెడ్డి,ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి దొంతి కాంతమ్మ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## పారిశుద్ధ్య కార్మికరాలుకి పుట్టినరోజున పట్టుచీర అందజేత



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** డిపోకి చెందిన కం(డాక్టర్) గొలనకొండ వేణు, చైతన్య దంపతుల కనిష్ట కుమార్తె ఆరాధ్య 9వ,పుట్టినరోజు సందర్భంగా ఆదివారం రోజున గురిజాల గ్రామ పారిశుద్ధ్య కార్మికరాలు పాకాల రేణుకకు “ది చెన్నై షాపింగ్ మాల్ హనుమకొండ” వారి పట్టుచీర అందజేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. గ్రామ పంచాయితీ పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలో పారిశుద్ధ్యాన్ని, పరిశుభ్రతను నిత్యం నిర్వహించడంలో చేస్తున్న సేవలను వారు గుర్తించి, వారిని గౌరవించాలనే ఉద్దేశంతో తమ పిల్లల పుట్టినరోజున ఒకేసారి అందరికి కొత్త దుస్తులు అందజేసి వదిలేయకుండా, శాశ్వతంగా తన తుది శ్వాస ఉన్నంత వరకు నిరంతరాయంగా వారికి పంపిణీ చేయడానికి వినూత్నంగా శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది జనవరి 30న తమ కుమారుడు అర్జున్ పుట్టినరోజున ఈ కొత్త కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. ఇట్టి వినూత్న కార్యక్రమానికి గ్రామస్తులు, తోటి ఉద్యోగులు వేణు దంపతులను ప్రశంసిస్తున్నారు..

## గంజాయి అమ్ముతున్న మరియు సేవిస్తున్న ఐదుగురు యువకులపై కేసు నమోదు...

### మహబూబాబాద్ టౌన్ సిఐ గట్ల మహేందర్ రెడ్డి...



**తెలంగాణసేన :** మహబూబాబాద్ పట్టణంలో టౌన్ ఎస్ఐ మౌనిక తన సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా స్థానిక నిజాంచెరువుకట్ట సమీపంలో ఐదుగురు యువకులు అనుమానాస్పదంగా ఉండి, పోలీసు వారిని చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వెంటనే సిబ్బంది సహకారంతో వారిని పట్టుకుని వారిని విచారించగా వారిపేర్లు 1) లూనావత్ రవీందర్ తోకబోడుతండ, కురవి మండలం, 2) భూక్య వినోద్, అయ్యప్పటెంపుల్ఏరియా, మహబూబాబాద్, 3) లావుడ్య పవన్, కాకతీయకాలనీ, మహబూబాబాద్, 4) భూక్య కుమార్, భవానినగర్ తండ, మహబూబాబాద్ 5) భూక్య సాయిరాం, జగ్యాతండ, కురవి మండలం అని చెప్పి, వీరారం తండాకు చెందిన బాదావత్ ప్రశాంత్ అను అతడు భద్రాచలం అరకు ప్రాంతాల నుండి గంజాయిని తక్కువ ధరకు తెచ్చి వారికి అమ్మేవాడని, అతని దగ్గర ఈ యువకులు గంజాయిని కొనుక్కొని తాగడమే కాకుండా ఇతరులకు విక్రయి స్తున్నట్టు ఒప్పుకున్నారు.. వారిని చెక్ చేయగా లివారి వద్ద నుంచి చిన్న చిన్న పొట్లాలుగా కట్టిన సుమారు 1,27,500/- రూ,,ల విలువైన రెండున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు, మరియు ఐదుగురు యువకుల వద్ద నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఎల్లమ్మ అమ్మవారి దర్శనానికి విచ్చేసిన.. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గౌడ్”



**తెలంగాణ సేన న్యూస్ :** దుబ్బాక మండలం, పెద్దగుండవెల్లి గ్రామంలోని రేణుకా మాత ఎల్లమ్మ దేవాలయానికి భక్తితో విచ్చేసిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గౌడ్ గారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పూలు, గాజులు, చీర సమర్పించి, గ్రామ ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, “గ్రామం లోని ప్రతి ఒక్కరూ రేణుకా మాత ఆశీస్సులతో అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలనీ, ఉన్నత శిఖరాలను అందు కోవాలని” ఆకాంక్షించారు. దేవాలయ చైర్మన్ మహేష్ మ్మవారి చిత్రపటం మరియు లడ్డు ప్రసాదాలను కత్తి కార్తీక గౌడ్ గారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ క్యాషియర్ కొండ యాదగిరి, వైస్ చైర్మన్ మల్లు గారి ప్రేమ్ కుమార్, పంజ సత్యనారాయణ, చిన్ని సంజీవరెడ్డి, రాళ్ల బండి ప్రవీణ్ కుమార్, తాళ్ల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాసర అమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి

### అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తుల కిటకిటలు



**తెలంగాణ సేన అక్టోబర్ 12 ( బాసర ప్రతినిధి) : నిర్మల్ జిల్లా** :- భారతదేశంలో పవిత్రమైన పుణ్యక్షేత్రమైన చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం తెలంగాణ రాష్ట్రంలోని నిర్మల్ జిల్లా బాసర మండలంలోని కొలువుదీరిన శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో పోటెత్తిన భక్తులు ఆదివారం సెలవుదినం కావడంతో బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి కనిపించింది . ఇతర రాష్ట్రాల నుండి తెలంగాణ.ఆంధ్ర ప్రదేశ్. కర్ణాటక.రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అమ్మవారి దర్శనానికి క్యూ కట్టారు అమ్మవారిని దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని తల్లిదండ్రులు తమ చిన్నారులకు అమ్మవారి పాదాల వద్ద ప్రత్యేక అక్షరాభ్యాస పూజలు నిర్వహించారు. అమ్మవారిని మొక్కులు చెల్లించుకున్నారు .ఆలయ ఈఓ అంజనీదేవి ఆలయ అధికారులు పోలీస్ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## బాసర నుండి అయ్యప్ప భక్తుల పాదయాత్ర ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**తెలంగాణ సేన అక్టోబర్ 12 ( బాసర ప్రతినిధి)** : నిర్మల్ జిల్లా :-బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రం నుండి అయ్యప్ప సన్నిధికి వెళ్లే భక్తుల పాదయాత్ర ను ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ప్రారంభించారు సునీల్ దత్ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర లో 40 మంది అయ్యప్ప మాల దారులు పాల్గొంటున్నారు. యాత్ర లో రాష్ట్రాల సరిహద్దుల వద్ద అఖిల భారతీయ ధర్మ ప్రచార సభ స్వాగతం పలికి ఏర్పాట్లు చేస్తుందన్నారు. అయ్యప్ప సన్నిధిలో అఖిల భారతీయ ధర్మ ప్రచార సభ జాతీయ అధ్యక్షులు అయ్యప్ప దాస్ స్వాగతం పలుకుతారన్నారు. పాద యాత్ర విజయవంతంగా పూర్తి కావాలని సరస్వతి అమ్మ వారిని మొక్కుకున్నట్లు ఎమ్మెల్యే అన్నారు. హిందువులంతా సుఖసంతోషాలతో ఉండాలని, ఆకాంక్షించారు.

## ఘనంగా కనుల పండగగా గాజుల పండగ

### వంటా వార్పు, ఆట, పాటల నడుమ దోస్తుల గాజులు



**తెలంగాణ సేన అక్టోబర్ 12 ( బాసర ప్రతినిధి)** : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా మహిళా దోస్తుల గాజుల పండగ ట్రెండ్ గా మారింది. దోస్తులు గాజులు వేసుకుంటే బాగుంటారన్న సాంప్రదాయంతో ఏకీభవించి మహిళాలు గ్రాండ్ గా ఈ గాజుల పండుగ జరుపు కొంటున్న విషయం విధితమే. ఆదివారం బాసర మండలంలోని కీర్గుల్( కె) గ్రామానికి చెందిన మహిళలు గాజుల పండగను కన్నుల పండువుల నిర్వహించుకొన్నారు. మహిళలందరు నిజామాబాద్ జిల్లా. నందిపేట్ మండలం సిహెచ్ కొండూర్ సౌడలమ్మ అమ్మవారిని దర్శించుకొని అనంతరం దేవి సన్నిధిలో ఏకరూప దుస్తులను ధరించి, ముందుగా గోరింటాకును ఒకరినొకరు పెట్టుకొన్నారు. అందరు పసుపు, కుంకుమ,పూలు ధరించి సాంప్రదయ బద్దంగా ఒకరినొకరు వారి స్నేహాన్ని గుర్తుచేసుకుంటూ వదినమరదలు. అక్క చెల్లెల్లు గాజులు వేసుకొన్నారు. అనంతరం వంటలు చేసుకొని భోజనాలు చేశారు. తదనంతరం కాలక్షేపనికి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని డిజె పాటలతో బతుకమ్మ పాటలతో. ఆటలను ఆడారు. అంత్యక్షరీ, పాటలు పాడుతూ ఆనందోత్సహాల మధ్య గాజుల పండగను రోజంతా అక్కడే గడిపారు.

## మెగా వైద్య శిబిరం విజయవంతం




**కంటోన్మెంట్, అక్టోబర్ 12 :** రోటరీ క్లబ్ ఆఫ్ జాగృతి హైదరాబాద్, జనహిత సేవా ట్రస్ట్, గాంధీయన్ హై స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 200 మందికి సేవలు అందించారు. పికెట్ లోని గాంధీయన్ హై స్కూల్ లో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, పుష్పగిరి నేత్ర వైద్య ఆస్పత్రి ద్వారా కంటి పరీక్షలు, క్లవ్ ఆసుపత్రి ద్వారా దంత పరీక్షలు, మా ఈ ఎన్ టీ ఆసుపత్రి ద్వారా చెవి, ముక్కు, గొంతు పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో రోటరీ క్లబ్ ఆఫ్ జాగృతి హైదరాబాద్ అధ్యక్షుడు గంటా శ్రీవర్ధన్, కార్యదర్శి తాతా శ్రీకాంత్, సభ్యులు సుకన్య, కమల, లక్ష్మీ, సుజనా, సుమ, న్యాయవాది భానుమూర్తి, గాంధీయన్ హై స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనంద్ ప్రభు, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు నర్సింహ మూర్తి, వెంకట్, రమేష్, నర్సింగ్ రావు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**లోకేశ్వరం:అక్టోబర్ 12:తెలంగాణ సేన న్యూస్.** : లోకేశ్వరం: మండలంలోని కనకాపూర్ గ్రామానికి చెందిన పిరాయి సాయిలు మాతృమూర్తి కొద్ది రోజుల క్రితం స్వర్గస్తులైనారు విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు శ్రీ జి. విఠల్ రెడ్డి ఆదివారం వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. మాజీ శాసనసభ్యులు వెంట మాజీ ఎంపీపీ భోజన్న మాజీ సర్పంచ్ నరేష్,ఎంపిటిసిలు సాయి రెడ్డి, తోట గంగాధర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజారెడ్డి,దేవన్న మరియు తదితరులు ఉన్నారు.

## బాణాసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

### దీపావళి సందర్భంగా భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి

### నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల.



**నిర్మల్: అక్టోబర్ 12: (తెలంగాణ సేన న్యూస్) :** ప్రజల భద్రత, క్షేమం దృష్టిలో ఉంచుకొని రాబోయే దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, సూచించారు. బాణాసంచా విక్రయాల కోసం అనుమతి తప్పనిసరి. ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేసినా, సరైన భద్రతా ప్రమాణాలు లేకుండా విక్రయాలు జరిపినా, ప్రేలుడు పదార్థాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీపావళి నేపథ్యంలో బాణాసంచా తయారీదారులు, సరఫరాదారులు, విక్రయదారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

**పాటించ వలసిన భద్రతా చర్యలు:**

దుకాణాల మధ్య కనీస దూరం పాటించాలి. అగ్నిమాపక పరికరాలు సిద్ధంగా ఉంచాలి. విద్యుత్ లైన్ల దగ్గర బాణాసంచా నిల్వ చేయరాదు. మైనర్లు (చిన్నపిల్లలు) విక్రయంలో పాల్గొనరాదు. ప్రజలందరూ చట్టాలు, భద్రతా ప్రమాణాలను పాటిస్తూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ డా. జి. జానకి షర్మిల కోరారు.

## ఘనంగా కొమురం భీం 85వ వర్ధంతి కార్యక్రమం



**నర్సంపేట, తెలంగాణసేన :** నర్సంపేట పట్టణంలో నర్సంపేట ఆదివాసి సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో మన్యం వీరుడు ఆదివాసి ల ఆశాజ్యోతి కీర్తిశేషులు కొమురం భీం 85వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణంలో నివాసం ఉంటున్న ఆదివాసీలు మరియు నర్సంపేట పరిసర గ్రామాలలో నివాసముంటున్న ఆదివాసులు హాజరై ఈరోజు కొమరం భీం విగ్రహానికి పువ్వులతో అభిషేకం చేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ నర్సంపేట పట్టణ ఆదివాసి సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షులు సువర్ణపాక పాపారావు మాట్లాడుతూ కొమరం భీమ్ యొక్క పోరాటం మరువలేనిది ఆదివాసుల కోసం అతను చేసిన త్యాగం మహోన్నతమైనదని కొని ఆడారు మరి ఆ అమరవీరుడి ఆశయ సాధనలో అందరూ నడవాలని ఆయన ఆశయాలను సాధించడం కోసం నడుం బిగించాలని హాజరైన ప్రజానీకాన్ని కోరడం జరిగింది. అదేవిధంగా ప్రస్తుతం నడుస్తున్నటువంటి ఉద్యమం చట్టబద్ధతలేని లంబాడీలను ఎస్టీ జాబితాలో నుండి తొలగించాలని తెలంగాణ రాష్ట్రం మొత్తం ఆదివాసీలు ఉద్యమిస్తున్నటువంటి తరుణంలో నర్సంపేట పట్టణంలో ఉన్న ఆదివాసీలందరూ ఆ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పేరుపేరునా విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆదివాసి సంక్షేమ సాంస్కృతిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సువర్ణపాక జగ్గారావు గారు గొంది సమ్మయ్య గారు ఇరుప చంద్రయ్య గారు తన్నరి కృష్ణమూర్తిగారు ధనుసర్ అంజయ్య గారు కొనకవి విజయ్ గారు కల్తి మహేందర్ గారు మొలకమ్ వీరస్వామి గారు ఏనుగు నారాయణ గారు కల్తీ శ్రీమతి నాగలక్ష్మి గారు మరియు నర్సంపేట పట్టణంలో ఉంటున్నటువంటి దొరపటేళ్ళు మరియు కమిటీ సభ్యులు మహిళలు యువకులు అందరూ హాజరయ్యారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

సోమవారం 13 - 10 - 2025

# నూతన మద్యం పాలసీ 2025 - 2027 షాపుల కేటాయింపులో రిజర్వేషన్ సౌకర్యం



**నిర్మల్: అక్టోబర్ 12 (తెలంగాణ సేన న్యూస్) :** నిర్మల్ జిల్లా లోని మొత్తం (47) మద్యం దుకాణాలలో (09) తొమ్మిది రిజర్వేషన్ చేశారు. గౌడ కులస్తులకు (03), ఎస్సీలకు (05) మరియు ఎస్టీలకు (01) షాపు కేటాయింపు చేశారు. రిజర్వు చేయబడిన దుకాణాల వివరాలు క్రింద చూపించబడ్డాయి. ఎస్టీ: 1. నర్సాపూర్-జి, షాప్ నెం.2 ఎస్సీ లు: 1. సోన్ షాప్ నెం.2 2. సారంగ్‌పూర్ షాప్ నెం.1, 3. కడెం షాప్ నెం.1, 4. భైంసా మునిసిపాలిటీ షాప్ నెం.5, 5. తనూర్ గ్రామం., గౌడ్స్: 1. నిర్మల్ మున్సిపాలిటీ షాప్ నెం.1, 2. పెంబి గ్రామం , 3. కుబీర్ షాప్ నం.1, రిజర్వేషన్ కేటగిరీలో అప్లయ్ చేసేవారు తెలంగాణ ప్రభుత్వం చే జారి చేసిన కుల ధృవీకరణ పత్రం జత చేయాలి. ప్రస్తుత కుల ధృవీకరణ పత్రం లేని వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఎక్సైజ్ అధికార కార్యాలయంలో ఉన్న అండర్టేకింగ్ జత చేయాలి. తర్వాత కుల ధృవీకరణ పత్రం 15.11.2025 లోగ సమర్పించాలి. కావున రిజర్వేషన్ కేటగిరీలో అప్లై చేసేవారు దరఖాస్తులు చేసుకోవాలని. అబ్దుల్ రజాక్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, నిర్మల్ తెలిపారు. దరఖాస్తులు/ దరఖాస్తులు జిల్లా కార్యాలయంలో ఉచితంగా అందజేస్తామని తెలిపారు. దరఖాస్తుదారులు హెల్ప్ డెస్క్ నుండి దరఖాస్తులను ఉచితంగా తీసుకోవచ్చు. దరఖాస్తులను అక్టోబరు 18 వరకు స్వీకరణకు గడువు ఉంది. అక్టోబరు 23న మద్యం వినియోగం దరఖాస్తులను లాటరీ పద్ధతిలో డ్రా ద్వారా ఎంపిక చేస్తారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక చేస్తారు. ప్రతి దరఖాస్తుకు ఆధార్ కార్డు లేదా పాన్ కార్డు, మరియు మూడు (3) కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జత చేయాలి. ప్రతి దరఖాస్తు వెంబడి రూ.3,00,000/- (మూడు లక్షలు) దరఖాస్తు రుసుంగా నాన్ రిఫండబుల్ ఫీ చెల్లించాలి. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైన వేయడానికి అవకాశం ఉంటుంది. ఒక్కసారి ఎన్ని మద్యం. దరఖాస్తులను వేయడానికి అవకాశం కల్పించారు. డిడి లేద చలాన్లను "జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి, నిర్మల్ పేరు మీద ( జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్, నిర్మల్ లేదా కమీషనర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, తెలంగాణ వద్ద హైదరాబాద్ " పేరున తీయాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారాలను జిల్లా ప్రొహిబిషన్ మరియు ఏక్సైజ్-అధికారి నిర్మల్, 2వ అంతస్తు. రూం నెం.13 లోని, %×ణుజు%, కలెక్టరేట్, నిర్మల్ లో దాఖలు చేసింది ఒక ప్రకటన లో. మరిన్ని వివరాలకు ఈ దిగువ ఫోన్ నంబర్లకు సంప్రదించాలని తెలిపారు. ఎండి. అబ్దుల్ రజాక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, DP&EO, నిర్మల్. 8712658774, నజీర్ హుస్సేన్, సీఐ భైంసా 8712658790, ఎన్. రంగస్వామి, సీఐ నిర్మల్. 8712658791. సంప్రదించాలని కోరారు.

# సమ్మక్క సారక్క, శివరాత్రి జాతర తర్వాత రాజన్న ఆలయ ఆభివృద్ధిని కొనసాగిస్తూ పనులు చేయండి

భీమేశ్వర ఆలయంలో భక్తులకు వసతులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు ఉన్నాయా...?

భక్తుల మనోభావాలు మీకు పట్టవా

మరో మూడు నెలల దాకా రాజన్న ఆలయాన్ని మూసివేస్తే సహించేది లేదు

బిఆర్ఎస్ పట్టణ శాఖ డిమాండ్



**వేములవాడ, అక్టోబర్ 12 (తెలంగాణ సేన) :** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయాన్ని అభివృద్ధిలో భాగంగా సమ్మక్క సారక్క, మహాశివరాత్రి జాతర తర్వాత మూసివేసి అభివృద్ధి చేస్తే భక్తుల మనోభావాలను కాపాడిన వారవుతారని బిఆర్ఎస్ పట్టణ శాఖ డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఆదివారం భీమేశ్వర ఆలయంలో భక్తులకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కోడె మొక్కు, అర్జిత సేవల భక్తులకు ఏర్పాటుచేసిన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నిమ్మశెట్టి విజయ్ మాట్లాడుతూ నిన్నటి రోజున ఆలయ అధికారులు, ప్రభుత్వ విప్ గారు భీమేశ్వర ఆలయంలో కోడెమొక్కు, అర్జిత సేవలు ఏర్పాటు చేశామని ప్రకటనలు చేసి, తీరా సాయంత్రంలోపే రెండు రోజుల్లో గుడి మూసివేస్తామని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. భీమేశ్వర ఆలయంలో భక్తులకు కోసం దాదాపు 3కోట్ల రూపాయలతో ఏర్పాటుచేసిన పనులు ఎక్కడికక్కడనే నత్తనడకన సాగుతున్నాయని, ఇప్పటి వరకు కోడే కట్టేయడానికి సరైన స్థలం లేదని, ఫ్లోరింగ్ కూడా పూర్తి కాలేదని, ఎలాంటి ఏర్పాట్లు పూర్తికాక ముందే భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు.

పూర్తిస్థాయిలో వసతులు ఏర్పాటు చేసిన తర్వాతే రాజన్న ఆలయం మూసివేయాలని లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. వసతులు ఏర్పాటు చేయకముందే ఎందుకంత తొందరలో ఆలయాన్ని మూసివేస్తున్నారని దీనిపై సరైన స్పష్టత ఇవ్వాలన్నారు.

అలాగే రాజన్న ఆలయం ఇలా అభివృద్ధి చేస్తారో ఇంతవరకు డిపిఆర్ ఇవ్వలేదని ఎలా అభివృద్ధి చేస్తారో దానిపై కూడా స్పష్టత ఇవ్వాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పాలన అధికారులు, ఆలయ అధికారులు రాజన్న ఆలయ అభివృద్ధి కాలపరిమితి, భీమేశ్వర ఆలయంలో భక్తులకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసిన తర్వాతనే రాజన్న ఆలయంలో దర్శనాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాజన్న ఆలయాన్ని నమ్ముకుని 5వేల పైగా చిరు వ్యాపారులు జీవనం సాగిస్తున్నారని మరి వారి పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సొంత నిర్ణయాలు పనికిరావని రాజన్న ఆలయం మన రాష్ట్రానికే పెద్ద శైవ క్షేత్రంగా విరాజిల్లుతుందని అది గుర్తుంచుకోవాలని తెలిపారు.

మూడు నెలల తర్వాతనే రాజన్న ఆలయంలో దర్శనాలు నిలిపివేసి, భీమేశ్వ రాలయంలో భక్తులకు సకల వసతులు ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్లు మారం కుమార్, సిరిగిరి చందు, గోలి మహేష్, జోగిని శంకర్, నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, సంపునూరి మల్లేశం, గుడిసె సదానందం, వెంకట్ రెడ్డి, చేపూరి రవీందర్, సత్యనారాయణ రెడ్డి, పోతూ అనిల్ కుమార్, గజ్జల రమేష్, సందీప్, తదితరులు ఉన్నారు.

# భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా రాజన్న ఆలయ అభివృద్ధి

అందరి సలహాలు, సూచనల మేరకు గుడి అభివృద్ధి, విస్తరణ పనులు చేయిస్తాం

రాజన్న ఆలయ మూసివేత ఉండదు.. స్వామివారికి నిత్య పూజలు కొనసాగుతాయి

రాజన్నకు మొక్కలు, ఇతర పూజలకు భీమేశ్వరాలయంలో అన్ని ఏర్పాట్లు

ఆలయ అభివృద్ధి, విస్తరణకు అందరూ సహకరించాలి

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్





**వేములవాడ, అక్టోబర్ 12 (తెలంగాణ సేన) :** భక్తుల విశ్వాసాలు, మనోభావాలకు అనుగుణంగా రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు చేపడుతామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధిపై ఆలయ ఆవరణలోని చైర్మెన్ గెస్ట్ హౌస్ లో ప్రభుత్వ విప్ ఆదివారం మాట్లాడారు. శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి, వాస్తు, పండితులు, అర్చకులు పట్టణ ప్రముఖుల సలహాలు, సూచనల మేరకు ప్రజా ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి రాజన్న ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టారని తెలిపారు. రూ. 150 కోట్లతో ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు మొదలు అయ్యాయని వివరించారు. రూ. 47 కోట్లతో ప్రధాన రహదారి విస్తరణ పనులు ఇటీవల ప్రారంభించామని వివరించారు. రాజన్న భక్తులకు సులభంగా వేగంగా దర్శనం, వసతి కల్పించాలని ఉద్దేశంతో ఆలయ అభివృద్ధి, విస్తరణ నేపథ్యంలో భీమేశ్వరాలయంలో మొక్కులు, ఇతర పూజలు చేసుకునేందుకు రూ. 3. కోట్ల 48 లక్షలతో ఏర్పాట్లు చేశామని తెలిపారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు యధావిధిగా అన్ని పూజలు, అభిషేకాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. రాజన్న ఆలయంలో భారీ యంత్రాలతో పనులు జరిగే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా.. భక్తుల భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రత్యామ్నాయంగా భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ అనేది భక్తుల ఎజెండా అని పేర్కొన్నారు. భక్తుల కోసం ఎవరు ఎలాంటి సూచనలు చేసిన తప్పకుండా గౌరవిస్తామని స్పష్టం చేశారు. అందరి సలహాలు సూచనల మేరకు పనులు చేపడుతామని విప్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం చేయిస్తున్న పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న దర్శనాలు నిలిపి వేయద్దంటూ బీజేపీ నాయకుల నిరసన...



**వేములవాడ,అక్టోబర్ 12 (తెలంగాణ సేన)** :వేములవాడ భారతీయ జనతా పార్టీ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం నిర్వహించారు. రాజన్న మొక్కులు రాజన్నకే చెల్లించాలి గాని భీమన్నకు ఎలా చెల్లిస్తారు అంటూ బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజరాజేశ్వర స్వామి దర్శనాలను ప్రజలకు దూరం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని తెలిపారు. దర్శనాలను బందు చేస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ నాయకులు హెచ్చరించారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



**ముధోల్, అక్టోబర్ 12 (తెలంగాణ సేన న్యూస్):** ద్విచక్ర వాహనం అదుపుతప్పి మండలంలోని ఎడ్ బిడ్ గ్రామానికి చెందిన నర్సయ్య అనే వ్యక్తికి ఆదివారం తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భైంసా పట్టణం నుండి ఎడ్ బిడ్ గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మండలంలోని విట్టోలి గోదాం వద్ద మరో వాహనాన్ని తప్పిస్తుండగా.. ఒకేసారి ద్విచక్ర వాహనం అదుపుతప్పి పంట పొలంలోకి వెళ్ళింది.దీంతో నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్ కి సమాచారం అందజేసి భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# ఈ నెల 19న వేములవాడకు శృంగేరి పీఠాధిపతి రాక

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**వేములవాడ, అక్టోబర్ 12 (తెలంగాణ సేన) :** ఈ నెల 19వ తేదీన ఆదివారం శృంగేరి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ జగద్గురు విధుశేఖర భారతి స్వామి వారు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి రానున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెల్లడించారు. శృంగేరి పీఠాధిపతి రాక సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై వేములవాడలోని రాజన్న ఆలయ చైర్మన్ గెస్ట్ హౌస్ లో ప్రభుత్వ విప్, ఎస్పీ మహేష్ బి గితే, దేవదాయ శాఖ సలహాదారు గోవింద హరి, ఆలయ ఈవో రమాదేవితో కలిసి ఆదివారం సమీక్షించారు. ఆలయ స్థానాచార్యులు ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం అయ్యారు. పీఠాధిపతి రానున్న సందర్భంగా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు..

# జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి సర్వం సిద్ధం..



**తెలంగాణ సేన న్యూస్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం అక్టోబర్ (12 ) : బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నేడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్, SPR హిల్స్ గ్రౌండ్, రహమత్ నగర్‌లో ఘనంగా నిర్వహించనున్నది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీ, ఆర్,ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు (కేటీఆర్) మరియు అలాగే మరో కీలక నేత, లిమాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు . ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నాయకులు, తదితర ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.నియోజకవర్గంలో పార్టీ శ్రేణుల ఐక్యత, బలపరిచేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేయబడింది. రేపు జరగబోయే విస్తృత స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ పిలుపునిచ్చింది.బీఆర్ఎస్ శ్రేణులు,నియోజకవర్గానికి చెందిన నాయకులు, మహిళా విభాగం, యువజన విభాగం,ప్రజాప్రతినిధులు ఈ సమావేశానికి హాజరై పార్టీ శక్తిని బలోపితం చేద్దాం. కారు గుర్తుకు ఓటేద్దాం..!

# ఘనంగా సుర్వి భువనేశ్వర్ గౌడ్ జన్మదిన వేడుకలు




ఈరోజు జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న యాదాద్రి భువనగిరి జిల్లా, నారాయణపురం మండల బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు, సుర్వి రాజు గౌడ్ -సౌజన్య దంపతుల తనయుడు సుర్వి భువనేశ్వర్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భువనేశ్వర్ గౌడ్ కేక్ కట్ చేసి, స్వీటు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు, మాట్లాడుతూ, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని, చదువులో ఉన్నత స్థాయిలో ఉండాలని కోరుకుంటూ, తాత నానమ్మ: సుర్వి క్రిష్ణ - అండాలు, తాత అమ్మమ్మ: రాంపెల్లి శ్రీశైలం-శోభ, బాబాయి చిన్నమ్మలు: సుర్వి రాము - సుధారాణి, బద్దం శివకృష్ణ గౌడ్ - స్పందన సుర్వి మహేశ్ - అక్షర, సుర్వి ప్రవీణ్, మేనమామ అత్త: రాంపెల్లి సందీప్,నవిత అక్క: మనస్విని, చెల్లి:ఆరాధ్య అన్నయ్య: అక్షిత్, తమ్ముళ్ళు: హన్విత్,బబ్బు, నయాన్ గౌడ్, మేనత్తలు మామలు: ఎల్లంకి ఝాన్సీ కుమార స్వామి గౌడ్, పాలకూరి ఉమాదేవి ప్రదీప్ కుమార్ గౌడ్, తాతమ్మలు: సుర్వి అంజమ్మ, మక్తాల మారమ్మ, రాంపెల్లి సుశీల బావలు: వరుణ్ గౌడ్ శబరినాథ్ గౌడ్ సాయి నిఖిల్ గౌడ్ కార్తికేయ గౌడ్ మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు

# భైంసాలో కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షుడి ఎన్నికలకు సన్నాహాలు

రాష్ట్ర అబ్జర్వర్ డా. అజయ్ సింగ్ రాక



**భైంసా, అక్టోబర్ 12 :తెలంగాణ సేన న్యూస్. :** నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నూతన డీసీసీ అధ్యక్షుడి ఎన్నికల ప్రక్రియలో భాగంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు, కర్ణాటక ఎమ్మెల్యే డా. అజయ్ సింగ్ మంగళవారం (14-10-2025) ముధోల్ నియోజకవర్గంలోని భైంసా టౌన్ హరియాలి ఫంక్షన్ హాల్ వద్ద మధ్యాహ్నం 2 గంటలకు జరగబోయే కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అబ్జర్వర్ ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు భోస్లె నారాయణరావు పాటిల్ స్థానిక నాయకులు ఘన స్వాగతం పలకనున్నారు. ఈ సమావేశంలో ముధోల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పార్టీ పదవిదారులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్‌లు, లైబ్రరీ చైర్మన్, యువజన, మహిళ, రైతు, విద్యార్థి విభాగాల నాయకులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓబీసీ విభాగ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, ఆత్మ చైర్మన్‌లు, పీసీసీ సభ్యులు, సేవాదళ్ అధ్యక్షులు, అలాగే మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు హాజరు కావాలని నారాయణ్ రావు పటేల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, నూతన అధ్యక్షుడి ఎంపికపై అభిప్రాయ సేకరణ జరగనుంది.

# జూబ్లీహిల్స్ లో మాగంటి సునీతకి పెరుగుతున్న ప్రజ మద్దతు





**తెలంగాణ సేన న్యూస్:** జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలోని రహమత్ నగర్ డివిజన్, వినాయక్ నగర్ బస్తీలలో మాగంటి సునీత గారికి మద్దతుగా బీ,ఆర్,ఎస్ పార్టీ మహిళలు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలపై అవగాహన కల్పిస్తున్నారు.బస్తీవాసులు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఇప్పటి వరకు అమలు చేయలేదని వారు ఆరోపిస్తున్నారు. రేపు జరగబోయే ఎన్నికల్లో 'కారు గుర్తుకే మా ఓటు వేస్తామని గంటపదంగా చెబుతున్నారు .ఈ ఇంటింటి కార్య క్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళలు, సోనక్క, ప్రమీలమ్మ, శోభమ్మ, తదితరులు పాల్గొన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నారు.ం

# కొనరావుపేట మండలంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం



**కొనరావుపేట, అక్టోబర్ 12 (తెలంగాణ సేన) ::** వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు రాష్ట్ర విప్ ఆది సీనన్న ఆదేశాల మేరకు కొనరావుపేట మండలంలో యూత్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో మండలంలోని నలుమూలల నుండి వచ్చిన యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షులు న్యాత నవీన్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త క్రియాశీలకంగా పనిచేయాలని, నియోజకవర్గ స్థాయిలో ప్రతి సమస్యపై స్పందిస్తూ యువతను సమీకరించి పార్టీ ఆలోచనలను ప్రజల వద్దకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. యువతలో నేతృత్వ లక్షణాలను గుర్తించి వారికి యూత్ కాంగ్రెస్ లో పదవులు ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నారు. ప్రతి మండలానికి ప్రత్యేక కార్యాచరణ రూపరేఖలు రూపొందించి, రానున్న రోజుల్లో బూత్ స్థాయిలో కార్యకర్తల సమీకరణ, సోషల్ మీడియా వేదికగా ప్రజల సమస్యలపై స్పందన, గ్రామస్థాయిలో వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు చేస్తున్న అభివృద్ధి పథకాలను, పనులను డోర్ టూ డోర్ ప్రచారం నిర్వాయించారు.

# బీసీ సంక్షేమ సంఘం పాపయ్యపేట గ్రామ కమిటీ ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మేడి సాయికృష్ణ గౌడ్, కందాళ వెంకటేశ్వర్లు



**తెలంగాణసేన :** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ ద్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ఆదేశాల మేరకు జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నూరి రవి ముదిరాజ్, జిల్లా అధికార ప్రతినిధి మరుపల వీరస్వామి కురుమ ల సమక్షంలో చెన్నారావుపేట మండల అధ్యక్షులు బర్ల యాకయ్య నూతన గ్రామ కమిటీ గ్రామ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు కమిటీని సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేడి సాయికృష్ణ గౌడ్, ఉపాధ్యక్షుడిగా చెన్నూరి స్వామి ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా కందాళ వెంకటేశ్వర్లు, ముఖ్య సలహాదారులుగా గుర్రం రవి, కోశాధికారిగా మేడి సంతోష్ గౌడ్, కార్యదర్శిగా ఎర వెంకటేశ్వర్లు లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మేడి ప్రభాకర్, కత్తి స్వామి, తాళ్ళ సమ్మయ్య, బుడిగె నాగయ్య, లింగాల రాంమల్లు, ఉప్పరి స్వామి, బుడిగె వెంకన్న, చీనూరి బిక్షపతి, మీరాల కుమారస్వామి, మొర్రి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# బాసర ఆలయంలో బ్రహ్మశ్రీ గోవిందహరి ప్రత్యేక పూజలు



**తెలంగాణ సేన అక్టోబర్ 12 ( బాసర ప్రతినిధి) :** నిర్మల్ జిల్లా దక్షిణ భారతదేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ధార్మిక సలహదారు బ్రహ్మశ్రీ గోవింద హరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 17 నుండి 19 వరకు తెలంగాణ రాష్ట్ర విజయ యాత్రలో భాగంగా అమ్మవారి ఆలయానికి దక్షిణామ్నయ శృంగేరి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి మహాస్వామి రానున్నారు. దీంతో ఏర్పాట్ల నిమిత్తము బ్రహ్మశ్రీ గోవింద హరి వచ్చారు. శృంగేరి జగద్గురువుల ఆగమన ఏర్పాట్ల కోసం ప్రత్యేక సమావేశం దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త శరత్ పాఠక్ ఆలయ కార్యనిర్వహణ అధికారి అంజనీ దేవి, ఏఈఓ ఆలయ వైదిక కమిటీతో నిర్వహించి సలహాలు సూచనలు ఇచ్చారు ఏర్పాట్లు ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆలయ వైదిక కమిటీ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయంలో భక్తులకు దర్శనాలు కల్పించాలి

ఆలయం మూసివేస్తే... పంచె కట్టుకొని వచ్చి తరుస్తాం

ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవాలి

కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**వేములవాడ, అక్టోబర్ 12 (తెలంగాణ సేన) :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ అభివృద్ధి పనుల నేపథ్యంలో దర్శనాలు నిలిపివేయనున్నట్లు అధికారులు చేసిన ప్రకటన నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భీమన్న ఆలయంలో రాజన్న మొక్కులు చెల్లించుకునేందుకు ఏర్పాట్లు చేయడంపై బండి సంజయ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజన్న మొక్కులు భీమన్నకు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. భక్తుల మనోభావాలకు భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఆలయం మూసివేస్తే పంచలు కట్టుకుని వచ్చి మరీ ఆలయం తలుపులు తెరుస్తామన్నారు. ఫైరింగ్ చేస్తారో లాఠీచార్జి చేస్తారో చూద్దామని చెప్పారు. ప్రభుత్వానికి రెండు రోజులు సమయం ఇస్తున్నామని ఆలోపు ప్రభుత్వం తన నిర్ణయం మార్చుకోకపోతే ఏం చేయాలో అది చేస్తామన్నారు. బీజేపీ కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వాలు వస్తాయి. పోతాయి మేం భక్తులకు అండగా నిలుస్తామన్నారు.